జ్యోతిష్పథం

# తరతమభేదాలకు అతీతుడు భగవానుడు

- డిఎస్సార్



అందరినీ సమానంగా చూసేవాడు భగవానుడే! ఆయనకు తరతమ భేదాలు లేవు. అవగాహన లేని వాళ్ళకు సూర్యకాంతి అన్ని జీవరాసుల మీద ఒకటిగానే ప్రసరించినట్లుగా కనుపించిన్నట్లులేదు! భగవంతుడు నన్ను ప్రేమించినట్లుగాలేదు అనేది తలుపులు, కిటికీలు మూసి సూర్యకాంతి నా ఇంటిలోకి రావటంలేదన్నట్లు, నాకు వెలుతురు యివ్వడం లేదు అన్న చందంగా వుంటుంది. తన ఒడ్డునవున్న శాండల్‌వుడ్ చెట్లకు, మామూలు చెట్లకు నది నీరు యిస్తున్నది కదా ? శాండల్‌వుడ్ చెట్లకు అంత సువాసన వుందికదాయని నీరు తమకు సువాసన యివ్వడంలేదు, అని మామూలు వృక్షాలు అనుకుంటే ప్రయోజనం ఏముంది ? భగవంతుడు అన్ని వృక్షాలకు, అన్ని జాతుల జీవరాసులకు, తన కరుణను ప్రసరింపజేస్తాడు, ఆ మనస్సు మనకు వుండాలి.

చాలామంది, తమకోరికలను తీర్చమని దేవుని ప్రార్థిస్తారు. మృత్యుపేటికలను తయారు చేసేవాడు "భగవంతుడా ? ఈ రోజు ఎవరో ఒకరిని మరణించేటట్లు చేయి వారు నా మృత్యు పేటికలను కొనగలరు అని ప్రార్థిస్తాడు. రోగిష్టు అయిన భర్తను ఆరోగ్యవంతుణ్ణి చేయి అని భార్య, పిల్లలు కోరుకుంటే ఏమిటి ? వాళ్ళ చేసే పనులవల్ల, భగవానుడు ఎట్లా అంగీకరించగలడు. ఇందుకు దేవుని నిందించి ప్రయోజనం ఏముంది ? వారి, వారి కర్మలననుసరించి భగవానుడు నడుచుకోగలడు గాని ఆయనను నిందించటమేమిటి ? ఆయన నిష్పక్షపాతి.

మనం చేసే పనులవల్ల ఫలితాలుంటాయి. మంచి పనులు చేస్తే మంచి జరుగుతుంది. చెడు పనులు చేస్తే చెడు జరుగుతుంది. సుఖదుఃఖాలు కలిగేది అందుకే! కొందరు తమకు తెలియకుండానే తప్పులు చేసి, తెలియక చేసాను దేవా ? తప్పులు మన్నించు అని వేడుకుంటారు. అలాంటి వారిని మన్నించే అవకాశం వుంది. సూర్యుడు నిర్మలమైన నీటిలో ప్రకాశిస్తాడు. అదే మడ్డిగా వున్న నీటిలో అంతగా ప్రకాశించడు. అదేవిధంగా స్వార్థము, గర్వం వున్న

మనుజులు భగవానుని ప్రేమకు ఎలా పాత్రులు కాగలరు ? భగవంతుని కృపకు పాత్రులము కావాలంటే, మనమనస్సులు నిర్మలంగా వుండాలి. ఇతరుల పట్ల ప్రేమగా, దయా దాక్షిణ్యాలు కనబర్చాలి, బాధపడ్తున్న వారి పట్ల దయాగుణం కల్గి వుండాలి.

ఒక మహాత్ముని ఆశ్రమానికి అనేకమంది పర్యాటకులు వస్తుంటారు, ఆయన ఆశీస్సులు పొందడానికి. ఒకరోజున ఆయన భక్తులను పరామర్శిస్తున్న సమయంలో చిన్న పిల్లవాడు వాంతి చేసుకున్నాడు. ఆ వాసనను భరించలేక కొందరు ముక్కులు మూసుకున్నారు. మరికొందరు ఆవాసన భరించలేక వెళ్ళిపోయారు. కొందరు గురువుగారికి ఫిర్యాదు చేసారు. "గురూజీ! ఒక పిల్లవాడు వాంతి చేసుకున్నాడు. ఆవాసనను భరించలేకపోతున్నాము. ఆ ప్రదేశాన్ని శుభ్రం చెయ్యమని ఎవరికన్నా చెప్పాలి అని..." విన్న మహాత్ముడు, వెంటనే లేచి ఆవాంతి చేసుకున్న ప్రదేశానికి చేరుకోగానే, ఒక విద్యాధికుడయిన కుర్రవాడు, ఆ ప్రదేశాన్ని శుభ్రం చేస్తున్నాడు. అక్కడవున్న పర్యాటకులు చుట్టూ చేరి అతను శుభ్రం చేస్తున్న తీరుచూస్తున్నారు. ఆ కుర్రవాడు తన నిస్వార్థశక్తితో, సేవా గుణంతో ఆ పని చేయగల్గాడు. అతను ఆ మహాత్ముని ఆకర్షించాడు. ఇలాంటి కుర్రాళ్ళు ఈ ప్రపంచం అంతా వుండివుంటే ఒక స్వర్గంలా విలసిల్లగల్గేది అన్నాడు మహాత్మ.

మహాత్ముడి దృష్టిలో అంతా సమానులే! కాని ఆ కుర్రవాడు ఒక్కడే ఆయన దృష్టిలో పడ్డాడు. భగవంతుని దృష్టి కూడా యిటు వంటిదే! భగవంతుడు అన్ని జీవులపట్ల ఇలాంటి కరుణ ప్రదర్శిస్తుంటాడు. మనం నీళ్ళ టాంక్‌కు గండి పెడితే నీరు అంతటా ప్రవహిస్తుంటుంది. అలాగే నిస్వార్థత, దయ, క్షమా వున్న అందరినీ భగవంతుడు కరుణిస్తాడు.

ఆయన పాక్షిక దృష్టిలేని వాడు, మన ప్రపంచంలో చూస్తున్న విభేదాలకు అతీతుడు. అందరి పట్ల సమదృష్టికలవాడు. మన ప్రవర్తన మనం చేసే పనులు నిర్మలంగా వుంటే భగవంతుడు మన పట్ల ప్రసన్నుడవుతాడు. అప్పుడు శాంతి సౌభాగ్యాలతో ఈ పుడమి విలసిల్లగల్గుతుంది.

# ఏకాగ్రత, పట్టుదల

**– శ్రీ బోనెపూడి వెంకయ్య**

బాలుడైన బోపదేవునికి రోజూ దెబ్బలు తగులుతున్నాయి. బడిలో ఉపాధ్యాయుడు ఇలా అనేవాడు – 'నీవు మందబుద్ధివి, నీకు ఆ బ్రహ్మదేవుడు కూడా చదువు చెప్పలేదు.' ఇంటిలో తండ్రి అనే మాట – 'ఇన్నేండ్లు వచ్చాయి. ఒక్క అక్షరం ముక్క రాదు. భగవంతుడు అందరికీ మెదడు పెడుతుంటే నీవెక్కడో తిరుగుతూ ఉండివుంటావు.'

ఇలాంటివెన్నో మాటలు ఉపాధ్యాయుడు, కుటుంబ సభ్యులు, సహపాఠులు రోజూ అంటుండేవారు. అతను విని ఊరుకునేవాడు. ఒక రోజున ఉపాధ్యాయుడు అందరి ముందు బాగా దండించాడు. అతనికి శరీరబాధకంటే మానసిక బాధ ఎక్కువయింది. 'జీవించి ఏం లాభం? ఇంతకంటే చచ్చిపోవటం మంచిది' అని అతనికి అనిపించింది.

మరణిద్దామనే సంకల్పం మనస్సులోకి రాగానే అతడు ఊరు విడిచి వెళ్లిపోయాడు. ఏదైనా బావిలో దూకి ప్రాణాలు వదలుదామా అనుకున్నాడు. బావి వద్దకు వెళ్లాడు. చూస్తే స్త్రీలు నీళ్లు తోడుకుంటున్నారు. ఖాళీ అయినప్పుడు ఒంటరిగా వెళ్లి ఆ బావిలో దూకుదామని కొంతదూరంలో కూర్చుని స్త్రీలందరూ ఎప్పుడు వెళ్లిపోతారా అని ఎదురు చూస్తున్నాడు.

అతని దృష్టి అంతా ఆ బావిపైనే ఉంది. ఇంతలో అతని చూపు అక్కడి పిట్టగోడ రాయి మీదికి మళ్లింది. బావి అంచున్న ఉన్న ఆ రాయి త్రాటి ఒరిపిడికి అరిగిపోయింది. లోతుగా గాడి పడింది. రోజు మట్టికుండలు పెట్టడంవల్ల బండలూ అరిగిపోయాయి. అంతే అతని మనస్సులో ఒక ఆలోచన మెరిసింది. 'నా మెదడు ఈ రాతికంటే మొద్దుబారి ఉందా? రోజూ త్రాటీ ఒరిపిడికి రాతిమీద గుర్తులు పడినప్పుడు, నా మనస్సులో మాత్రం ఎందుకు ముద్ర పడదు?' అంతే, అతని ఆలోచనలు మారిపోయాయి. ప్రాణాలు వదలుదామన్న ఆలోచన అంతమయింది. ఒక దృఢసంకల్పంతో అతడు ఇంటికి తిరిగివచ్చాడు.

తీవ్రమైన శ్రద్ధతో, నిరంతర అభ్యాసంతో సాధించలేనిది ఏముంటుంది. బోపదేవుడు కూడా చక్కగా చదువుకుని, ఉన్నత స్థితికి ఎదిగాడు.

**– 'భారతీయమార్గము' సౌజన్యంతో**

# సుబోధ

**భక్తుడు :** సంసారంలో ఉన్న వ్యక్తికి జ్ఞానం సిద్ధించిందనడానికి ఏమిటి చిహ్నాలు ?

**శ్రీరామకృష్ణులు :** భగవన్నామాన్ని ఉచ్చరించగానే ఒళ్ళు పులకరిస్తుంది. భగవంతుని మధురనామాన్ని వినగానే రోమాలు నిక్కబొడుచుకుంటాయి, కళ్ళవెంట అశ్రువులు ధారకడతాయి. అలాంటి వ్యక్తిలో కామకాంచనాల పట్ల ఆసక్తి పోయిందనీ, అతడికి భగవదనుభూతి కలిగిందనీ తెలుసుకో. అగ్గిపుల్ల ఎండి ఉన్నప్పుడు ఒక్కసారి గీయగానే గుప్‌మని మండుతుంది. కానీ అది చెమ్మగిల్లి ఉన్నప్పుడు యాభైసార్లు గీచినా కూడా మండదు, పుల్లలే వ్యర్థం అవుతాయి. మనస్సు విషయాసక్తి అనే రసంలో మునిగి ఉంటే భగవంతుని గురించిన చైతన్యం జాగృతం కాదు.

భగవదనుభూతి పొందిన వ్యక్తి దేహసుఖాలను కాంక్షించడు. అతడిలో దేహమే ఆత్మ అనే బుద్ధిపోతుంది. అతడు జీవన్ముక్తునిగా తిరుగాడుతూ ఉంటాడు.

**భక్తుడు :** సంసారంలో ఉంటూ భగవంతుని వైపుగా సాగడం ఎలా సాధ్యం ?

**శ్రీరామకృష్ణులు :** సంసారమనే నీటిలో మనస్సు అనే పాలను ఉంచితే అవి కలసిపోతాయి, కనుక మనస్సు అనే పాలను పెరుగుగా మార్చి ఏకాంతమైన చోట ఉంచి చిలికి, వెన్న తీసి, దాన్ని సంసారమనే నీటిలో ఉంచాలి.

సంసార జీవితం గడిపే వ్యక్తి ఆధ్యాత్మిక సాధనలు తప్పక అనుష్ఠించాలి; ఏకాంతంలో వ్యాకుల మనస్సుతో భగవంతుణ్ణి ప్రార్థించాలి. పాండిత్యంతో భగవత్సాక్షాత్కారం పొంద లేవు. విచారణ ద్వారా భగవంతుణ్ణి తెలుసుకోలేరు. ప్రతి ఒక్కరూ భగవంతుని పాదపద్మాల పట్ల భక్తి ప్రపత్తులకై పాటుపడటమే మంచిది.

భగవంతుడు ఎవరినైతే పట్టుకుని ఉన్నాడో, వారికి ఎలాంటి భయంలేదు. పొలం గట్టుమీద నడిచేటప్పుడు తానే స్వయంగా తండ్రి చేతిని పట్టుకొన్న పిల్లవాడు ఏమరుపాటుతో చేయిజారి క్రిందపడిపోయే ప్రమాదం ఉంది. అయితే, తండ్రే పిల్లవాడి చేతిని పట్టుకున్నట్లయితే వాడు అలా పడిపోయే ప్రమాదం ఉండదు.

**– 'శ్రీరామకృష్ణ ప్రభ' సౌజన్యంతో**

# ఓం నమో భగవతే వాసుదేవాయ

– సేకరణ : బండారు భాగ్యలక్ష్మి, నర్సాపురం
సెల్ : 9963893525

**(గత సంచిక తరువాయి)**

**శ్రీభగవానువాచ :**

**శ్రద్ధావాన్ లభతే జ్ఞానం**
**తత్పరః సంయతేన్ద్రియః**
**జ్ఞానం లబ్ధ్వా పరాం**
**శాన్తిమచిరేణాధిగచ్ఛతి.**
(అ.4, శ్లో. 39)

**తాత్పర్యము :** గురు, శాస్త్రవాఖ్యము లందు శ్రద్ధ కలవాడును ఆధ్యాత్మిక సాధనలందు తదేక నిష్ఠతో గూడిన వాడును, ఇంద్రియములను లెస్సగ జయించిన వాడునగు మనుజుడు జ్ఞానమును పొందుచున్నాడు. అట్లు జ్ఞానమును బొందినవాడై యతడు పరము శాంతిని శీఘ్రముగ బడయగల్గుచున్నాడు.

**వ్యాఖ్య :** ఏ కార్యమందైనను శ్రద్ధ అధికముగ నున్నపుడే సత్ఫలితములు చేకూరును. గురువునందుగాని, దైవ మందుగాని, శాస్త్రమందుగాని జీవున కెంతెంత శ్రద్ధ అధికముగ నుండునో, అంతంత ఉత్తమ ఫలములను వారి వలన అతడు బడయ గల్గును 'ఇది తప్పక మేలు కలిగించును' అను అచంచల విశ్వాసముతో సాధనను ఉపక్రమించవలసినదేకాని 'ఇది సిద్ధించునో లేదో, దానివలన మేలు ఉండునో లేదో' అను సంధిగ్ధ స్థితి ఉండ రాదు. కనుకనే భగవానుడీ 'శ్రద్ధ'యను సుగుణమును గూర్చి గీతయందు పలుతావులు చెప్పుచున్నారు. "తత్పరః" – ఇక రెండవ సుగుణము "తదేకనిష్ఠ"! పట్టుదలతో, ఏకాగ్రతతో తదేక చింతనతో జ్ఞానమును సాధించ వలెను. శరీరము, వాక్కు, మనస్సు అను త్రికరణములు ఆ కార్యమునందే సం లగ్నములు కావలెను. ఇతరకార్యములు తగ్గించుకుని ఈ జ్ఞాన ప్రాప్తి రూప ఏకైక కార్యమందే చిత్తమును కేంద్రీకరింప వలెను. చిత్తము యొక్క శక్తులన్నియు ఛిన్నాభిన్నములుకాక ఒకే వస్తువునందు ప్రసరించినచో అప్పుడు అఖండశక్తి ప్రాదుర్భవింప లక్ష్యమును అది కరతలా మలకముగావించు కొనగలదు. కావున మనస్సును దృశ్య విషయముల నుండి మరల్చి పరమార్థ విచారణవైపునకు

త్రిప్పి తదేక నిష్ఠతో దానిని సాధించవలెను. అప్పుడే ఆ జ్ఞానము శీఘ్రముగ సిద్ధించును. "సంయతేన్ద్రియః" – జ్ఞాన ప్రాప్తికి మూడవ ఆవశ్యకత ఇంద్రియ నిగ్రము, ఇంద్రియముల ద్వారా మనస్సు బహిఃప్రపంచము వైపునకు పరుగిడు విషయములపై వ్రాలు చుండినచో, హృదయాంతర్వర్తియగు ఆత్మను అది ఏకాలమందు తెలిసికొనజాలదు. మరియు జ్ఞాన నిష్ఠయందు ఏకాగ్రత సంభవించదు. కావున అంతర్ముఖత్వమవలంభించవలెను. అదియు, ఇంద్రియనిగ్రహము లేనిదే ఎన్నటికిని సిద్ధింపదు కాబట్టి జ్ఞాన ప్రాప్తికి, ఆత్మ సాక్షాత్కారమునకు ఇంద్రియ నిగ్రహము అత్యంతావశ్యకమైనది 'సంయతేన్ద్రియః' అని చెప్పుట వలన ఇంద్రియములను లెస్సగ నిగ్రహింపవలెననియు, సామాన్య నిగ్రహము చాలదనియు సూచితమగుచున్నది. సాధకునకు ఇంద్రియములు ప్రబలశత్రువులు, జ్ఞానప్రాప్తికి ఇంద్రియ సంయమము అత్యావశ్యకమని ఇచ్చట తెలుపబడుటకు కారణము. ఈ ప్రకారముగ శ్రద్ధ, తదేక నిష్ఠ, ఇంద్రియ నిగ్రహములను అవలంభించి జ్ఞానమును బొందినచో కలుగు ఫలితమేమి ? 'పరమశాంతి' (సామాన్య శాంతి కాదు) జ్ఞానమును బొందిన వెనువెంట ఈ పరమ శాంతి జీవునకు లభించును. అదియే మోక్షస్థితి. 'అచిరేణ' అని చెప్పుటవలన అట్టి ఫలితము జ్ఞానానంతరము శీఘ్రాతి శీఘ్రముగ కలుగునని భావము. సూర్యోదయముచే అంధకారము నశించి పరమప్రకాశము తక్షణమే నలుదెసలా వ్యాపించినట్లు జ్ఞానోదయముచే సంసార దుఃఖము అంతరించి మోక్షరూప పరమశాంతి వెంటనే లక్ష్యమగును. ప్రపంచములో దృశ్యవస్తువులచే లభించునది అల్పశాంతియేకాని పరమ శాంతి కాదని మరువరాదు, 'జ్ఞానజ్యనమగు ఈ పరమశాంతి కొరకై యత్నించుదురు గాక'.

**శ్రీభగవానువాచ :**

**అజ్ఞశ్చాశ్రద్ధదానశ్చ**
**సంశయాత్మా వినశ్యతి**
**నాయం లోకోఽస్తి న పరో**
**న సుఖం సంశయాత్మనః**

(అ.4, శ్లో. 40)

**తాత్పర్యము :** జ్ఞానము లేనివాడు, శ్రద్ధారహితుడు, సంశయ చిత్తుడు వినాశనమునే పొందును. సంశయ చిత్తునకు ఇహలోకముగాని, పరలోకము గాని, సౌఖ్యముగాని లేవు.

**వ్యాఖ్య :** గురువాక్యమునందు, శాస్త్రవాక్యము నందు, పరమార్ధ సత్యములందు విశ్వాసము, శ్రద్ధ కలవాడు జ్ఞానప్రాప్తిచే పరమశాంతిని బొందునని క్రిందటి శ్లోకమున చెప్ప బడినది. అట్టి శ్రద్ధలేని వాడు జ్ఞాన హీనుడై సంసార కూపమున పడి నశించునని ఈ శ్లోకమున తెలియ జేయబడినది. (1) అజ్ఞాని, (2) శ్రద్ధ లేనివాడు, (3) సంశయచిత్తుడు అను ఈ ముగ్వురును కడతేరరనియు, వినాశమునే పొందుదురనియు చెప్ప బడినది, ఇందు అజ్ఞాని పరమార్ధ విషయములను తెలియక, తెలిసి కొనుటకైనను యత్నించక, దృశ్యమును సత్యమని నమ్మి జనన మరణముల బాల్పడి నశించును. శ్రద్ధలేనివాడు శాస్త్రాదులందు అవిశ్వాసము కల్గి వానియందు ప్రవర్తింపక తత్ఫలితముగ ధర్మచ్యుతుడై నశించును. ఇక మూడవ వాడు అగు సంశయ చిత్తుడు ప్రతిదానిని సందేహించుచు, కింకర్తవ్య విమూఢుడై, పరమార్ధ సాధన చేయక ఊరకయుండి నశించును, సంశయాత్మునుకి ఇహపర సౌఖ్యములుగాని మనశ్శాంతిగాని ఉండవని భగవానుడు తెలియజేసెను. సంశయము మనస్సును పీల్చిపిప్పి జేయును. కావున ముముక్షువు శాస్త్ర, గురువాక్యములందు విశ్వాసము కలిగి, సంశయమును పారద్రోలి ఆధ్యాత్మ పథమున పురోగమించవలెను. అపుడే పూర్ణసుఖము (మోక్షస్థితి) చేకూరగలదు.

**(సశేషము)**

*(గీతామకరంద రచయిత శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామివారి నిత్యస్మరణీయ గీతావాక్యములు కొన్ని యధాతధంగా.)*

## సమాజ కార్యదర్శులు, రచయితలకు మనవి

దివ్యజ్ఞాన దీపిక ట్రస్టు e-mail id ప్రారంభించినది.
కావున మీ వ్యాసములు, మీ లాడ్జికి సంబంధించిన వార్తలు-విశేషాలు, ఫొటోలు e-mail id (deepikatrust1910@gmail.com) కి పంపగలరు.

ఇట్లు

**కార్యదర్శి, దీపిక ట్రస్టు.**

# సైన్సు, అక్కల్టిజమ్‌ల సమన్వయ విభేదనాలు

**శ్రీమతి యం.రాజసరస్వతి, గుంటూరు**
సెల్ : 9490541800

అక్కల్టిజమ్ ఒప్పుకోని విషయము "మానవుడు కోతి వంటి జంతువుల నుంచి ఏర్పడినాడు" అన్న శాస్త్ర నిర్ణయాన్ని. Vol. I, స్టాంజా VI (182–184 పేజీల గురించి) మరల గమనిద్దాము.

ప్రకృతి మానవ ఆస్ట్రల్ చుట్టూ 'ape' వంటి పదార్థ శరీరాన్ని ఏర్పరచి వుండ వచ్చు. అనేక మార్పులు పదార్థంలో జరుగుతున్నాయి కదా ? 4వ రౌండు భూమిపై ఆ విధంగా జరిగివుండవచ్చు. 1, 2, 3 రౌండ్లలో మనిషి రాయిగా, వృక్షముగా, జంతువుగా బ్రతికి వుండ వచ్చు. ప్రకృతి వైపరీత్యాలు తట్టు కోవటానికి చైతన్యము రూపాంతరాలు చెందుతుంది. హెకెల్ శాస్త్రజ్ఞుడు చెప్పిన "moneron"గా రాయి, వృక్షము, జంతువులో వుండి అనుకూల పరిస్థితులు ఏర్పడేవరకు మానవ మొనాడ్ వేచి వుండి వుండవచ్చు. అది శుద్ధదైవ తత్వముగా మారినాక, దానికి ఈ మానవ లక్షణం కూడా పోతుంది. జీవము, మొనాడు, ప్రపంచ మహా సముద్రంలో ఒక బిందువు మనము వాడేపదాలు ఉన్నత, నిమ్న మొదలైనవి. నిర్వాణస్థితిలో రక్షణపొంది బాహ్య పరిస్థితులను దేనినైనా అది ఎదుర్కో వచ్చు. మూలతత్వాన్ని, మూలదైవాన్నీ అది నిరంతరం ప్రతిబింబిస్తూనే వుంది. "స్వర్గమానవుడు రాయిగా, వృక్షంగా, జంతువుగా మరల దివ్యజీవిగా మారతాడని కాబలిస్టులు చెపుతారు. 'మనిషి' అంటేనే దివ్య మొనాడు. అతనిలోని ఆలోచించే తత్వము కాదు. అతను భౌతిక రూపము కూడా కాదు. అది ఇంకా తక్కువ. అమర ఆత్మను పక్కనబెట్టి సైన్సు నిమ్నజీవులనుంచి ఉన్నత జీవులను పరిణామాలను వెతుకుతూపోతోంది. స్టాంజాలలో వున్నదే సత్యము. నాల్గవ మూలజాతిలో జీవించిన జంతువులకు మానవ పరిణామంతో దగ్గర సంబంధము వున్నది. మన్వంతర మానవుడు ప్రకృతి సామ్రాజ్యాలన్నింటిగుండా ప్రయాణించి 4వ మూలజాతి మానవుని తయారు జేశాడు. 4వ మూలజాతిలో మానవ ఆస్ట్రల్స్‌ను అక్కల్టిస్టులు కూడా ఒప్పు కున్నారు.

4వ రౌండు వరకు ఆస్ట్రల్ ప్రోటో టైపులు, ఛాయాస్థితుల నుండి Globe 'D' పైన వున్న మూడవజాతి వరకు ఇథరియల్ తోడుగులతో వున్నారు. స్టాంజా VIII, 28వ శ్లోకంలో చెప్ప బడినట్లు చనిపోయిన జీవుల మిగులు పదార్థాల నుంచి మూడవ రౌండు జంతువులు ఏర్పడి క్షీరదాల వరకు పరిణామం చెందాయి. మానవునితో ఆ పరిణామము నవమాంతరముగా జరిగింది. ఆంథ్రోపాయిడ్ Ape మనసు లేని మానవుని నుంచి ఏర్పడింది. Mindless man అచ్చంగా, భౌతికంగా జంతువువలె వుండేవాడు. ఆంథ్రో పాలజీ వర్ణనలు మనం చెప్పుకుంటున్న విషయాలను సరిపోలుతాయి.

పిండాభివృద్ధి దశలు పరిణామ క్రమానికి మంచి ఋజువులు. పిండా భివృద్ధి కాలములో జీవి తనజాతి చరిత్రను పునరావృతము చేస్తుందని పరిణామ వాద మూలసూత్రము. వృక్షము నుంచి మానవ పరిణామము డార్విన్ ఋజువు చేయలేకపోయినా, అక్కల్టిస్టు ఋజువు పర్చగలడు.

Isis unveiled లో పిండాభివృద్ధిని గమనించిన ఆదిమ బీజ స్థితిగతులు అర్థమవుతాయని వ్రాసివుంది. ఆధ్యాత్మిక, భౌతిక మానవ పరిణామము భూమికి చెందినది.

ఆదిమబీజము పరమాణువుగా, అకర్బన పదార్థంగా, కర్బన పదార్థంగా మారుతూ, మారుతూ, భవిష్యత్తులో మానవుడు భూమి మూలకాలలోనో, పంచభూతాలలోనో ఎక్కడో లీనమైవుండే అవకాశం కూడా వుంది. అనంతం నుంచి వచ్చిన ఆదిమ బీజము మరల అనంతం వరకు వెళ్ళే ప్రయత్నంలోనే వుంటుంది.

తల్లి గర్భంలో పిండము పెరిగే విధానము చూస్తేనే అత్యంత ఆశ్చర్యజనకంగా వుంటుంది. విశ్వము, అనంతము, మనమందరము, దేహాలు, చుట్టూప్రకృతి, మనఆత్మలు అన్నీ పరబ్రహ్మలోని భాగాలే.

అక్కల్టిజమ్ చూపే నిజాలను సైన్సు తిరస్కరిస్తుంది. ఆది బీజము ఎన్నో దశల్లో పోతుంది అని అక్కల్టిస్టు ఒప్పుకుంటాడు. సైన్సు విధానము వ్యతిరేకంగా వుంటుంది. Mindless Man స్త్రీ జంతువుతో కలసి చేసిన అవమానకర ప్రక్రియలే ''మానవ పతనము''. మనిషి, జంతువుల సామ్యాన్ని చెప్పకూడదు.

ఆత్మ నుంచి అన్నీ ఏర్పడి పై నుంచి క్రిందికి దిగివచ్చింది పరిణామ ప్రక్రియ. కానీ సైన్సు క్రింద నుంచి పైకి పదార్థ రూపాంతరం గురించి చెప్తుంది.

Darwin సిద్ధాంతము సిల్యూరియన్ కాలానికి ముందున్న జీవుల నుంచి పరిణామం చెప్తుంది. అంటే ద్వారం వద్ద మొదలైంది డార్విన్ సిద్ధాంతము ఆత్మ భూమ్మీద అనంతంగా వ్యాపించి పరిణామం చెందింది. అది డార్విన్‌కు అర్థం కాలేదు. హెకెల్ శాస్త్రజ్ఞుని "moneron సిద్ధాంతానికి" ముందు, వున్నదేది ? అదే ఆత్మ. ఆత్మ ఇథరియల్‌గా కొంతకాలముంది, భూమిపై పరిణామం కొరకు, పదార్థ సంయోగం చెంది ఇప్పటి మానవ రూపంలో ultimate (పరిపూర్ణత) స్థితిని పొందింది.

## ఒక మంచిమాట

ఎవరో మనని దొంగ అని నిందించినప్పుడు వెంటనే బాధ కలగటం సహజం. కానీ ఆ విషయాన్ని పదేపదే గుర్తుకు తెచ్చుకోవటమే బాధకు కారణం అవుతుంది. దొంగ అనే రెండక్షరాల మాట అనటం క్షణంలో జరిగిన క్రియ. మనకున్న 24 గంటల్లో ఆ ఒక్క క్షణం అనేది ఎన్నోవంతు. కానీ పదేపదే మనమే దాన్ని గుర్తుకు తెచ్చుకొని ఆ భావనను రోజంతా నింపుకుంటున్నాం. కార్యంలో బాధ ఎలాగూ తప్పదు. ఇక్కడ తలపుల వలన కలిగే బాధ నుండి పరిహరించుకోవాలి.

మన మనసు బాధ నుండి విముక్తి కోరుకుంటుంది. మనసుకు శాంతి కావాలంటే తలపులన్నింటినీ లేకుండా చేసుకోవాలనే ఒక అపోహ ఉంది. కానీ ఆ ప్రయత్నం ఎప్పటికీ నెరవేరదు. ఎందుకంటే తలపులు లేకుండా జీవితమే లేదు. అందుకే దీనికి మార్గం ఏమిటంటే.. అప్పటి పనికి సంబంధించని ఆలోచనలను పరిహరించటం అలవాటు చేసుకోవాలి. ఇతర తలంపులకు మన జ్ఞాపకాలే కారణం. అప్పటికి అవసరం లేని ఆలోచన చేయటం అంటే మనలో నిక్షిప్తమై ఉన్న స్మృతులను (జ్ఞాపకాలను) దుర్వినియోగం చేయటమే అవుతుంది.

జిడ్డు కృష్ణమూర్తి వాఙ్మయం ఆధారంగా

# దేనినైనా ఉన్నది ఉన్నట్లుగా మనం చూస్తున్నామా ?

**సో॥ ఎ.టి. బాబాజీ,**
సెల్ : 8463969505

మనకు మనం వినియోగించే వస్తువులకు, మనతో కలిసిమెలిసి వుండే వ్యక్తులకు, మనం వ్యవహరించే విషయాలకు మధ్య సత్సంబంధాలు నెలకొనాలంటే, మనకు వాటితో సూటిగా, స్పష్టంగా, సంపూర్ణంగా అవగాహన కలిగి ఉండాలి. భౌతికంగా వాటితో మన యింద్రియాలు సంపూర్ణంగా సంపర్కం కలిగి ఉండవచ్చు, కాని వాటి స్వరూపస్వభావాలు అర్థమయితే తప్ప వాటిని సద్వినియోగం చేయలేం. వ్యక్తులను మనం కలిసేటప్పుడు, భౌతికంగానే కాకుండా వారితో మానసికంగా ఒకే సమయంలో, ఒకే తీవ్రతతో ఐక్యత, అనురక్తి కలిగి ఉండ గలము. వృత్తిరీత్యా, సాంఘికంగా తరతమ భేదాలుండవచ్చు, భేదాభిప్రాయా లుండవచ్చు. అయినా ప్రేమాభిమానా లతో జీవించగలం. అనేక సంఘటనలు, సమస్యలు ఎదురవుతాయి. వాటిని మనం ఏ దృష్టితో చూస్తున్నాము అనేదానిపై వాటి పరిష్కారం ఆధారపడి ఉంటుంది. సమస్య ఎప్పుడైనా కొత్తదే. మనం దాన్ని గత అనుభవాలతో, గత జ్ఞానంతో పరిష్కరించడానికి ప్రయత్నిస్తాం. అలా పరిష్కారం కాదు. వర్తమాన సమస్యను వర్తమాన అవగాహనే పరిష్కరించగలదు; అందుచేత, వస్తువులు, వ్యక్తులు, విషయాలపట్ల మన సంబంధానికి పునాది మన దృష్టి. ఆ దృష్టి కూడ, సూటిగా, స్పష్టంగా, సంపూర్ణంగా ఉండాలి. అసంపూర్ణ దృష్టి వల్ల మన సంబంధాలు గందరగోళానికి, ఘర్షణకు, హింసకు, వినాశనానికి దారి తీస్తాయి.

ఉన్నదానిని ఉన్నట్టుగా మనం చూస్తున్నామా అనే ప్రశ్న మనకు ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు, కాని దేనినీ వున్నది వున్నట్టు చూడ్డంలేదు అన్నది వాస్తవం. వస్తువునుగాని, వ్యక్తినిగాని, కోపము, దుఃఖము వంటి మానసిక సమస్యలను మనం వట్టిగా యింద్రియా లతోనే కాకుండా, అదనంగా దాని పేరు, స్వరూప, స్వభావాలతో కలిపి చూస్తున్నాము. ఒక పూవును చూచినపుడు, దానికి ఒక పేరు పెట్టి దానితో బాటు, దాని స్వరూప

స్వభావాలు, మనం యిది వరకే ఏర్పరచు కున్న యిష్టాయిష్టాలు కూడ గుర్తుకు వస్తాయి. అలాగే ఒక పరిచిత వ్యక్తిని చూచినపుడు, అతని పేరు, అతని స్వరూపస్వభావాలు, అతని గురించి మనం యిది వరకే ఏర్పరచుకున్న అభిప్రాయాలు కూడ గుర్తుకువస్తాయి. ఇంద్రియ జ్ఞానంతో బాటు, అభిప్రాయాలు కూడ ఏ మాత్రము కాలవ్యవధి లేకుండా వెన్వెంటనే మనం గ్రహిస్తున్నాం. ఇంద్రియాలు గ్రహించేది వాస్తవ జ్ఞానం, మనసు గ్రహించేది మానసిక జ్ఞానం.

పూవు, కుర్చీ, బల్ల, రంగు, రుచి, వాసన యింద్రియ స్పందనలు వంటివి వాస్తవాలు. ఇవి స్థిరంగా, మార్పు లేకుండా ఉంటాయి. వీటిని మొదడు గ్రహించి వాస్తవ జ్ఞానం తనలో నిక్షిప్తం చేసుకుంటుంది. అభిప్రాయాలు, తీర్పులు, నిర్ణయాలు, యిష్టం వంటివి మానసికస్పందనలు. ఇవి స్థిరంగా ఉండవు, తరచు మారుతూ ఉంటాయి. వీటిని మనసు మానసిక జ్ఞానంగా తనలో నిక్షిప్తం చేసుకుంటుంది.

పూవు అనేది సర్వనామము. దానికి గులాబి, సంపెంగ వంటి పేరు పెట్టి మనసు దాన్ని వాస్తవ జ్ఞానం నుంచి మానసిక జ్ఞానంగా మారుస్తుంది. వాస్తవ జ్ఞానంలో పేరు మాత్రమే ఉంటుంది. మానసిక జ్ఞానంలో అభిప్రాయాలు, యిష్టాయిష్టాలు కూడ ఉంటాయి. అంటే పూవును పూవుగానే చూడకుండా దాని స్వభావం, దాని పట్ల ఉన్న యిష్టా యిష్టాలతో చూస్తున్నాం. పూవును పూవుగా ఉన్నది ఉన్నట్లు చూడ్డం లేదు.

వస్తువుల, వ్యక్తుల, మానసిక స్పందనల పేర్లు మానవసంబంధాలలో అనర్థాలకు దారితీస్తాయి. రాచరిక వ్యవస్థలో జంతువులకు, అస్త్రశాస్త్రాలకు కూడ గాండీవం, ఐరావతం వంటి పేర్లు పెట్టేవారు. ఇప్పుడు తుఫానులను కూడ పేర్లతో పిలుస్తున్నారు. రైతులు తమ దగ్గర ఉన్న జంతువులకు పేర్లు పెట్టి పిలుచు కుంటారు. పేరు అనేది గుర్తింపు కోసం. కాని, మనుషులకు వ్యక్తిగతంగా పేరు పెట్టవచ్చుగాని, జాతులు, కులము, మతము, దేశముపరంగా పేరు పెట్టడం వల్ల మనుషుల మధ్య విభజనకు, తత్ఫలితంగా ఘర్షణకు కారణం అవుతోంది. ఒక వ్యక్తిని కులంతో పిలవడం అన్యాయం. కులం అనేది వృత్తి రీత్యా ఏర్పడినది. కాని పుట్టుకకు అది ఆపాదించబడుతోంది. కులాల మధ్య, వృత్తుల మధ్య, తరతమ భేదాలను

అంటగడతారు. దీని వల్ల మనషులు అందరూ ఒకటే అనే భావనకు అంతరాయం. అందుచేత, నాస్తికులు, సాంఘిక సంస్కర్త అయిన గోపరాజు రామచంద్రరావు అనే ప్రముఖ వ్యక్తి తన సంతానానికి సమరం, లవణం వంటి నామకరణాలుచేసి ఆదర్శవంతులయారు. గుమాస్తా, బంట్రోతు వంటి పదాలు తక్కువ స్థాయిని సూచిస్తాయి. అందు చేత వాటిని అసిస్టెంటు, అటెండరు అనే పదాలుగా మార్చారు. జాతులు, కులాలు కూడ మనుషుల మధ్య తరతమభేదాలను సూచిస్తాయి. జాతీయత కూడ విభజనకు దారితీస్తుంది. ఏ వ్యక్తినైనా ఒక పేరుతో పిలవడం ఉత్తమం. జాతి, మత, వృత్తులను అనుసరించి పిలవడం వసుధైక కుటుంబానికి దోహదం చేయదు. అంతేకాదు, పేరు అనేది మనిషి మనసుపై ప్రభావం చూపుతుంది. పదము పదార్థముకాదు, దేవుడు అనే పదము దేవుడుకాదు, పదము మాత్రమే, కాని దాని ప్రభావం అమితం. క్రీస్తు, బుద్ధుడు, గాంధీవంటి పేర్లు వాటి మానసిక చిత్రాలు మనమనసులో ప్రత్యక్షం అవుతాయి. ఎందుకంటె ఆయాపదాలతో మనసు కండిషను అయి ఉంది కాబట్టి. అలాగే భయము, హత్య వంటి పదాలు మన శరీరంలో మార్పులు తెస్తాయి. అందుచేత పేరు అనేది వ్యావహారికంగా గుర్తించడానికి తప్ప, జాతి, మత, వృత్తులను అనుసరించి ఉండకూడదు. మానసిక స్పందనలకు కూడ పేరు పెట్టకుండా వాటిని గమనించడం వల్ల అవి సమసిపోతాయి వాటికి పేర్లు అనవసరం.

సూర్యోదయం, సూర్యాస్తమయం వంటి అపురూప దృశ్యాలను మనం ఆస్వాదించి ఆనందించలేకపోతున్నాం. ఇంద్రియాల గ్రహింపు మాత్రమే ఉంటే ఉన్నవాటిని ఉన్నట్టుగా చూడగలం. కాని యింద్రియాల గ్రహింపు పూర్తి కాకుండానే మనసుచొరబడి తన మానసిక జ్ఞానాన్ని కాల వ్యవధి లేకుండా ప్రవేశపెడుతోంది. అందుచేత ఉన్నదానిని ఉన్నట్టుగా చూడలేకపోతున్నాము.

పరిచయం ఉన్న వ్యక్తి కూడ మనలను ఉన్నది ఉన్నట్టు గమనించ లేడు. మనలో కలిగే యింద్రియ, మానసిక స్పందనలు అతనిలో కూడ ఒకే సారి విడుదల అవుతాయి. అతనిలో కూడ మన పట్ల అభిప్రాయాలు, యిష్టా యిష్టాలు ఉంటాయి. ఇంద్రియ జ్ఞానంతో బాటు వాటితో మనలను చూస్తాడు,

(మిగిలినది 20వ పేజీలో..)

# 1875కి పూర్వం హెచ్.పి.బ్లావట్స్కి

(గతసంచిక తరువాయి)

**గుడిసేవ మురళీధర్,** బందర్,
సెల్ : 9573536110



కెనడ, అమెరిక, పెరు, వెస్ట్ఇండీస్, ఇండియ, శ్రీలంక, సింగపూర్, జావ, సుమిత్ర వరకు వెళ్లి మళ్లీ తిరిగి లండన్‌కు. ఈ యాత్రలో ఆమె ఇండియాకు వెళ్లింది గాని, టిబెట్‌కు వెళ్లటానికి వీలుపడలేదు. జూన్ 1854 సం॥లో ఆమె తన 'మార్గ నిర్దేశకుడు'ని కలుసుకుంది. అంతా విని అతను, "ఈసారి నీ యాత్రలో ఇండియా, టిబెట్‌లలో ఎక్కువ కాలం ఉండి, అక్కడి సాధుసన్యాసులు, సజ్జనుల నుండి నీకు కావలసిన విషయసేకరణ చేయుము" అన్నాడు.

ఆమె చేసిన యాత్రలో తనకు కావలసిన 'ఆది' అనేది తెలియలేదు. అందరు తమకు నచ్చిన, ఇష్టమైన ఆచారాలు, నమ్మకాలతోనె జీవిస్తున్నారే గాని, అన్నిటికి, సర్వవిశ్వానికి 'ఆది' అనె మొదలు ఎలా, ఎందుకు ప్రారంభ మయింది, దాని పని క్రమం ఏమిటి ? అనే ఆమె తాపత్రయం ఎవరికీ అర్థం కావటం లేదు. ఆమె రెండవసారి ప్రపంచయాత్ర మొదలుపెట్టి, దక్షిణ అమెరికా, ఇండియా, జపాన్‌లకు వెళ్లింది. ఈసారి ఆమెకు టిబెట్ వెళ్లటానికి వీలయింది. ఈ యాత్ర కాలం షుమారు రెండు సం॥లు పట్టింది. ఈ యాత్రలో ఆమె తన రక్షణ కోసం మగవాడిలాగ వేషం వేసుకుని, సిగరెట్లు కాల్చటం అలవాటు చేసుకుంది.

1870వ సం॥ చివరలో ఆమె టిబెట్‌ను వదిలి ఈజిప్టు, సైప్రస్, గ్రీసు దేశాలకు వెళ్లింది. జూన్ 1871లో యూనోమియా అనే చిన్న ఓడలో ఈజిప్ట్ నుంచి (వయా సైప్రస్) గ్రీసుకు బయలుదేరింది. గమ్యం చేరేముందు 21-6-1871నాడు మధ్యాహ్నం 1-30కి గ్రీసుకు సమీపంలో ఓడలో పెద్ద ప్రేలుడు సంభవించింది. ఈ

ప్రమాదంలో షుమారు 45 మంది గుర్తుపట్టలేనంతగా కాలిపోయారు. అప్పుడు ఓడలో మొత్తం ప్రయాణికులు షుమారు 150 మంది. బ్లావట్స్కీ కూడా సముద్రంలోకి పడిపోయింది. తోటి ప్రయాణికులు ఆమెను రక్షించారు. ఈ ప్రమాదానికి గల కారణాలను తెలుసుకోవటానికి, చనిపోయిన, గాయ పడిన వారి వివరాలను సేకరించటానికి, ప్రభుత్వం ఒక కమీషను వేసింది. దీని గురించి అప్పట్లో ఎన్నో వార్తలు వచ్చాయి. ఓడ ప్రయాణికుల లిస్టును పరిశీలించగా, అందులో బ్లావట్స్కీ పేరు లేదు; ఎందుకంటె ఆమె మరో ప్రయా ణికురాలి పేరు మీద ప్రయాణించింది. ఈ ప్రమాదంలో ఆమెకు గాయా లవటమే కాకుండా, లగేజీ కూడ పోయింది. పొందేవి కొన్ని ఉంటే పోగొట్టుకునేవి కూడా కొన్ని ఉంటాయి. ఎలాగో తిప్పలు పడి ప్రభుత్వ సాయంతోను, మిత్రుల సాయంతోను 1872 మధ్యలో ఉక్రెయిన్‌లోని తమ స్వంత ఇంటికి చేరింది. కొన్ని నెలలు బంధుమిత్రుల మధ్య స్వంత ఊరిలో నిశ్చింతగా కాలం గడిపింది. భర్త ఇంటిలో కొంతకాలం ఉన్నది. ఇంతలో ఆమె గురువు నుంచి 'పారిస్‌కి వెళ్లుము' అని మెసెజ్ వచ్చింది. 1873లో పారిస్‌కు వెళ్లింది. అక్కడ ఆమెకు కొన్ని అవమానాలు, ఆరోపణలు ఎదు రయ్యాయి. అలాగే కొన్ని నెలలు అతికష్టం మీద రోజులు గడుపుతుండగా ఆమె గురువు నుండి మరో మెసెజ్ వచ్చింది. అందులో 'అమెరికా వెళ్లుము' అని ఉంది. ఆ ప్రయత్నంలో భాగంగా ఆమె అమెరికా వెళ్లె ఓడలో పై తరగతి టికెట్‌కొని, ఓడ కోసం రేవులోని ఫ్లాట్‌ఫాం మీద ఎదురు చూస్తుండగా హృదయవిదారక సంఘటన ఎదు రయ్యింది. ఒక మహిళ, తన ఇద్దరు పిల్లలతో నేల మీద కూర్చుని బావురు మంటూ ఏడుస్తోంది. బ్లావట్స్కీ, ఆమె దగ్గరకు వెళ్లి విషయమడుగగా ఆమె వెక్కివెక్కి ఏడుస్తూ విషయం చెప్పింది. విషయమేమిటంటే ట్రావెల్ ఏజంటు, ఆమెను అమెరికా పంపిస్తానని భారీగా డబ్బు తీసుకుని నకిలీ టికెట్ ఇవ్వటంతో ఆమెను రేవు అధికారులు గేటు వద్ద ఆపేసారు. బ్లావట్స్కీ గుండె కరిగి పోయింది. బ్లావట్స్కీ, రేవు అధికారు లతో మాట్లాడి తన టికెట్‌ను మూడో తరగతి టికెట్‌గా మార్పించి, కొంత సొమ్ము అదనంగా చెల్లించి, ఆ ముగ్గురిని తనతోపాటు అమెరికా తీసుకువెళ్లింది. ఈ సంఘటన జరిగింది జులై 1873లో.

న్యూయార్క్ చేరిన తరువాత ఆమె దగ్గర డబ్బు అయిపోయింది. అప్పుడు అక్కడ డార్విన్ సిద్ధాంతం గురించి చర్చలు, గొడవలు జరుగుతున్నాయి. ఒక రకమైన వానరం కాలక్రమంలో నరుడిగా మారిందన్నదే ఆ సిద్ధాంతం. అది అక్కడి మతసిద్ధాంతానికి తగినట్లుగా లేదు కనుక మతపెద్దలు గొడవలు చేస్తున్నారు. అయినా ఆ సిద్ధాంతం ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందింది గాని, ఇప్పటి వరకు రుజువు కాలేదు. బ్లావట్‌స్కీ ఈ రెండు సిద్ధాంతాలను ఒప్పుకోలేదు. ఆమెకు కావలసింది 'సృష్టికి ఆది ఏమిటి, అది ఎలా, ఎప్పుడు వచ్చింది ? దాని ప్రయాణం ఎలా ఉంది ?' అనేది అక్టోబర్ 1874లో ఆమె 'డైలీ టెలిగ్రాఫ్' అనే వార్తా పత్రిక తిరగేస్తుండగా 'సౌకర్యవంతమైన ఇంటి జీవితంతో ఆధ్యాత్మిక జ్ఞానం' అనే వ్యాసం ఆమెను ఆకర్షించింది. ఆ పత్రిక చిట్టెండన్ అనే గ్రామం వద్ద గల ఒక ఫాం హౌస్‌లో ఆల్కాట్ అనె జర్నలిస్ట్ నడుపుతున్న పత్రిక. మరునాడు ఆమెకు మూడవ సందేశం గురువు నుండి వచ్చింది. 'చిట్టెండన్ అనే గ్రామం వద్ద గల ఫాంహౌస్‌లో ఆల్కాట్ అనే వ్యక్తి సరిగ్గా నీకులాగే ఆలోచిస్తూ, పరిశోధనలు చేస్తూ, సరైన గమ్యం తెలియక ఉన్నాడు. నీవు వెళ్ళి అతన్ని కలుసుకొనుము.' అని ఆ సందేశంలో ఉంది. ఒక గొప్ప సంస్థకి, పురాతన ఆధ్యాత్మిక సంస్థకి అప్పటల్ రూపం ఏర్పడింది.

ఒకరోజు వీలుచూసుకుని బ్లావట్‌స్కీ కెనడాకు చెందిన మాగ్నన్ అనే స్నేహితురాలి సాయంతో సదరు 'ఎడ్డీ ఫాం'లోకి వెళ్లింది. ప్రశాంత వాతావరణం, పచ్చని చెట్లు, పక్షుల కిలకిలా రావాలతో ఆహ్లాదకరంగా ఉంది. బ్లావట్‌స్కీ గుర్రపుబండి దిగి, ఆ ప్రకృతి రమణీయతను, మంచుతెమ్మెరలను ఆస్వాదిస్తూ అలాగే కొంతసేపు ఉండిపోయింది. కాని కదలకుండా నిలబడి ఉండటానికి గుర్రం ఇష్టపడలేదు. 'వచ్చిన పని చేసుకో' అన్నట్లు గుర్రం బుసకొట్టింది (సకిలించలేదు); మెడలోని గంట మ్రోగించింది. ఇద్దరూ లోపలకు వెళ్లగా అక్కడివారు భోజన సమయం కాబట్టి డైనింగ్ హాల్లో కూర్చోమన్నారు. పెద్దముక్కు గోల్డ్ ఫ్రేం కళ్లజోడు, నలిగిన బట్టలతో షుమారు 40 సం॥ వయసున్న వ్యక్తి వారి టేబుల్ వద్దకు వచ్చి ఎదురుగా కూర్చున్నాడు. అతని ముఖంలో ఏదో దివ్యమైన తేజస్సు కనబడుతోంది. భోజనాలు వచ్చాయి. అప్పటికి బ్లావట్‌స్కీకి అర్థమయింది 'ఆ వ్యక్తి ఆల్కాట్' అని. (ఆల్కాట్, బ్లావట్‌స్కీ

కంటే ఒక సం॥ చిన్నవాడు.) వారు ముగ్గురు ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. సాయంత్రం అయ్యేసరికి వేర్వేరు దేశాలకు చెందిన షుమారు 15 మంది అక్కడికి వచ్చారు. అందులో రష్యాకు చెందిన వ్యక్తిని తన దూరపు బంధువుగా గుర్తించింది. చాలా సేపు మాట్లాడుకున్నాక ఆల్కాట్, బ్లావట్స్కీ ఆలోచన పద్ధతిని గ్రహించాడు. ఆమెకు కావలసిన 'ఆది' అనే శాశ్వతవిజ్ఞానం. ఈ ప్రపంచానికి అర్ధం, గమ్యం ఏమిటో ఆమెకు తెలియాలి. కాని అటువంటి ఆధ్యాత్మిక విజ్ఞానం కావాలని కోరుకునే స్థాయికి ఈ ప్రపంచం ఇంకా ఎదుగ లేదు. మతపరమైన విజ్ఞానం అయితే సౌకర్యంగా ఉంటుంది కాబట్టి ప్రజలు అదే కావాలంటారు. ఉదాహరణకి జామపళ్లు, సపోట, మామిడి, నేరేడు, అరటి, ద్రాక్ష వగైరా పళ్లు కోసుకు తినడం 'మతం'తో పోల్చగా, ఆ పళ్లు మనకు ఇచ్చే వివిధ రకాల 'తీపి', ఆ చెట్లు, లేదా ఆ నేల ఎలా ఇచ్చాయి ? అని ఆలోచిస్తే అది జవాబు దొరకని ప్రశ్న అవుతుంది. 'ఎందుకీ బాధ ?' అని ప్రజలు అనుకుని ఆ పళ్లను తిందా మనుకుంటారు. ఆల్కాట్, బ్లావట్స్కీలు అలాకాకుండా ఆ పురాతనమైన, శాశ్వతమైన విజ్ఞానానికి కృషి చేశారు.

జులై 1875లో బ్లావట్స్కీ తన నోట్ బుక్‌లో ఇలా రాసింది. 'మతాలకు అతీతంగా తత్వసంబంధమైన ఒక సంస్థను, ఆల్కాట్ సాయంతో ప్రారంభించుము' అను సందేశం ఇండియా నుంచి వచ్చినట్లు ఆమె పేర్కొంది. 7-9-1875న 16 మంది అమెరికాలోని బ్లావట్స్కీ నివాసం వద్ద చేరారు. జార్జ్ ఫెల్ట్ అను ఇంజనీరు, ఫిలాసఫర్ 'ఇటలి, గ్రీసు, ఈజిప్టులలో కూలిపోయిన మతపరరాజ్యాలు' అను అంశం మీద చక్కగా, అందరికి అర్ధమయ్యేలా ప్రసంగించి, అందరి మెప్పు పొందాడు. అప్పుడు ఆల్కాట్‌కి తను వెదుకుతున్న వస్తువు ఏదో దొరికినట్లు ప్రశాంత భావన కలిగింది. వెంటనే అతను ఒక చిన్న కాగితం తీసుకుని, 'ఇప్పుడు మనం విన్న విషయం చాల ముఖ్యమైనది, అందరు తెలుసుకోవలసినది. ఇటువంటి జ్ఞానాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లటానికి మనం ఒక సంస్థను స్థాపించాలి' అని రాసి జడ్జి అను పేరుగల లాయర్‌కి ఇచ్చి, బ్లావట్స్కీకి ఇవ్వమన్నాడు. జడ్జి ఇచ్చిన కాగితం చదివి, ఆమె సంతోషంగా అంగీకరించింది. అంతే, అప్పటికప్పుడు వారి నిర్ణయాన్ని అక్కడున్న వారందరికీ అల్కాట్, బ్లావట్స్కీలు చెప్పారు. అందరు

"యస్, ప్రొసీడ్" అన్నారు. 'ఇటువంటి విషయాలకు సంబంధించిన సంస్థకు ఎటువంటి పేరు ఉండాలి ?' అను చర్చ మొదలయింది. భోజన సమయం అవటంతో 'చర్చ' సాయంత్రానికి వాయిదా పడింది.

సాయంత్రం అందరూ ఆశక్తిగా తిరిగి వచ్చారు. ఆల్కాట్ ప్రెసిడెంట్‌గా, ఉపన్యాసం ఇచ్చిన జార్జి ఫెల్ట్ ఉపాధ్యక్షుడుగా, జడ్జి సెక్రటరిగా బ్లావట్స్కీ కరస్పాండెంట్ సెక్రటరిగా ఎన్నుకున్నారు. సంస్థకు ఉండవలసిన నియమ నిబంధనలు రాసుకున్నారు. ఎప్పుడూ పుస్తకాలు చదువుతూ కనబడే సూదర్న్ అనే వ్యక్తిని లైబ్రెరియన్‌గా ఎన్నుకున్నారు. అప్పుడే అతను సంస్థ పేరు కోసం తిరగేస్తున్న డిక్షనరీతో ఉన్నాడు. అప్పుడే అతని డిక్షనరీలో 'థియోసఫి' అని కనబడింది. అది అందరికీ చూపించగా ఆ పేరే సంస్థకు ఖాయం చేసి, 'థియోసాఫికల్ సొసైటి' అను పేరుతో మన ముందు ఈనాడు నిలబడింది.

**(సమాప్తం)**

---

**(దేనినైనా ఉన్నది ఉన్నట్లుగా.. 15వ పేజీ తరువాయి..)**

కాబట్టి అతను కూడ మనతో సూటియైన, స్పష్టమైన, సంపూర్ణమైన సంబంధం కలిగి ఉండడు.

వస్తువులకు, జంతువులకు, వృక్షాలకు మనసు ఉండదు, కాబట్టి అవి మన పట్ల అభిప్రాయాలు, యిష్టాయిష్టాలు ఏర్పరచుకోవు. వాటిని మనం ఉన్నవి ఉన్నట్లు చూడగలం. పరిచయంలేని వ్యక్తులతోకూడ మనం ఆ క్షణంలో సత్సంబంధం ఏర్పరచుకోవచ్చు. ఎందుకంటె, మనకు అతనికి మధ్య గత జ్ఞానపు భయాలు ఉండవు కాబట్టి. అదే మొదటిసారి చూచినట్లు చూస్తాము పరస్పరం. ఆ దృష్టిస్పష్టమై, సంపూర్ణమై ఉంటుంది.

వస్తువులను, వ్యక్తులను, విషయా లను చూచే క్రమం పూర్తి కాకుండనే మనసు చొరబడి తన గతజ్ఞానంతో తనకు గల భావాలను, పేరును జోడించడం వల్ల మనం వాటిని ఉన్నవి ఉన్నట్లు చూడలేకపోతున్నాము.

# వింత జననములు

**– శ్రీ గాలి రఘువరప్రసాద్,** హైదరాబాద్

మన ఇతిహాసాలలో, పురాణాలలో వున్న కొంతమంది గొప్పవారు వింతగా జన్మించారు. అందులో పురుషులు, స్త్రీలు కూడా ఉన్నారు. పురుషులలో మాంధాత, అగస్త్యుడు, వశిష్టుడు, స్కంధుడు, ద్రోణుడు, కృపుడు ఇట్టివారు కాగా స్త్రీలలో ఊర్వశి, కృపిని చెప్పుకో వచ్చు.

**మాంధాత**

మాంధాత ఇక్ష్వాకు వంశంలో జన్మించిన చక్రవర్తి, ద్రోణ పర్వంలో వ్యాసుడు చెప్పిన 12మంది గొప్ప రాజులలో ఒకడు. ఈతని తండ్రి యవనాశ్వుడు.

యవనాశ్వునికి ఇద్దరు భార్యలు. చాలాకాలం సంతానం కలగనందున యవనాశ్వుడు భృగుమహర్షి మహాముని ఆశ్రమానికి వెళ్ళి ఇక్ష్వాకువంశం అంతరించి పోకుండా వుండడానికి తనకు సంతానం కలుగచేయమని వేడుకున్నాడు. భృగుమహర్షి 'ఇంద్ర దైవతయాగం' చేస్తూ ఒక పాత్రలో మంత్రజలాన్ని నింపి, యవనాశ్వునికి ఇచ్చి అతని భార్యలకు ఇవ్వమని చెప్పాలని అనుకుని, ఆ పాత్రను ఆశ్రమంలో ఒక మూలన ఉంచాడు. యాగం పూర్తికావచ్చింది. యాగం చూస్తున్న యవనాశ్వునికి దాహంవేసి ఆశ్రమంలో జలం కోసం వెదకగా భృగుమహర్షి దాచిన మంత్రజలం వున్న పాత్ర కనిపించింది. వెంటనే ఆ జలాన్ని తాగి తన దాహం తీర్చుకున్నాడు. భృగుమహర్షి జరిగింది తెలుసుకొని ఏమీ చేయలేకపోయాడు.

యవనాశ్వుడు గర్భం ధరించాడు. పది మాసాలు నిండినవి. యవనాశ్వుని పొట్ట కుడివైపు చీల్చుకుని మాంధాత జన్మించాడు. ఇక్ష్వాకు వంశంలో రాముడు పుట్టవలసినందున సూర్య వంశం అంతరించి పోకుండా వుండ డానికి, ఆ బాలుని బ్రతికించడానికి ఇంద్రుడు పూనుకొని, మాంధాత కుడిచేతి బొటన వేలును నోటికి అందించి తన ద్వారా పాలు అందేటట్లు చేసాడు. పుట్టిన బాలునికి తాను పాలు ఇచ్చినందున ఆ బాలునకు ఇంద్రుడు 'మాంధాత' అని పేరు పెట్టాడు. (మాం– నన్ను (నా పాలు) ధాత – తాగినవాడు.

**వశిష్టుడు – గౌతముడు**

వశిష్టుడు మొదటిజన్మలో బ్రహ్మ

మానసపుత్రుడు. బ్రహ్మ ఉచ్ఛ్వాసము నుండి ఆవిర్భవించాడు. నిమి మహారాజు తాను చేయం తలపెట్టిన బ్రహ్మసత్రయాగాన్ని నిర్వహించడానికి ముందు వశిష్టుని ఆహ్వానించాడు. కానీ అప్పటికే వశిష్టుడు ఇంద్రుడు చేస్తున్న యాగం నిర్వహించడానికి ఒప్పు కున్నందున ఆ యాగం పూర్తైన తరువాత వస్తానన్నాడు. కానీ, నిమీ అంతవరకు వేచియుండక గౌతమముని నిర్వహణలో తన యాగాన్ని పూర్తిచేస్తాడు. తరువాత వశిష్టుడు నిమి దగ్గరకు వచ్చి యాగం పూర్తియైనదని తెలుసుకొని ఆగ్రహించి నిమిని విదేహుడవు కమ్మని శపించాడు. తపస్సంపన్నుడైన నిమికూడ వశిష్టుని విదేహుడవు కమ్మని శపించాడు. ఆ శాపంతో శరీరం కోల్పోయి వాయు రూపంలో వున్న వశిష్టుడు తన తండ్రి యైన బ్రహ్మ దగ్గరకు వెళ్ళి శరీరం లేకుండా తాను నిర్వహించవలసిన కర్మలు నిర్వర్తించలేనని తనకు శరీరం ప్రసాదించమని కోరాడు. బ్రహ్మ విదేహుడైన వశిష్టుని 'మిత్రా వరుణ' అనువారి (ద్వాదశాదిత్యులలోనివారు) తేజస్సు లోనికి ప్రవేశించమని చెప్పాడు. వశిష్టుడు అలానే చేసాడు. మిత్ర, వరుణులు తపస్సులో మునిగివున్నారు. అప్పుడు ఊర్వశి ముందుగా వరుణుని దగ్గరకు వచ్చి అతనిని లోబరుచు కోవాలని చూసింది. కాని వరుణుడు ఊర్వశిని తిరస్కరించాడు. కానీ, ఆమె అందానికి వరుణుడు చలించి నిగ్రహం కోల్పోయాడు. ఫలితంగా బయల్వెడలిన అతని బీజశక్తిని ఒక కుండలో వుంచాడు. తరువాత ఊర్వశి మిత్ర దగ్గరకు వెళ్ళింది. మిత్ర కూడ నీవు ముందుగా వరుణ దగ్గరకు వెళ్ళావు కాబట్టి నీవు ఆయనకు చెందిన దానవేనని పంపించివేశాడు. కాని మిత్ర తిరస్కరించినప్పటికీ ఆమె అందానికి చలించి నిగ్రహం కోల్పోయాడు. ఫలితంగా బయల్వెడలిన అతని బీజశక్తిని వేరొక కుండలో వుంచాడు. వరుణుని బీజశక్తినుండి గౌతముడు, మిత్రుని బీజశక్తి నుండి వశిష్టుడు ఉద్భవించారు.

**స్కందుడు**

తారకాసుర సంహారం కోసం దేవతలు శివపార్వతుల వివాహాన్ని ప్రోత్సహించారు. వివాహానంతరం శివపార్వతులు ఏకాంత మందిరంలో అనేక దివ్యసంవత్సరాలు క్రీడా వినోదంలో వున్నారు. వారి క్రీడ పూర్తయ్యే వరకు వేచియుండక దేవతలు శివుని వద్దకు వెళ్ళి తారకాసురుని ఆగడాలను ఏకరువు పెట్టారు. ఫలితంగా శివ పార్వతుల క్రీడాభంగం కాగా శివుని

బీజశక్తి భూమిపై పడి పర్వతాలు, అడవులు ఆక్రమించింది. దీన్ని చూసి దేవతలు భయభ్రాంతులై ఆ బీజశక్తిని గ్రహించిన అగ్ని క్షీణించి పోయి బంగారువన్నెలోనికి మారిపోయాడు. బ్రహ్మదగ్గరకు వెళ్ళి తన బాధను చెప్పి పరిష్కారం కోరదామని బయలుదేరాడు. మార్గమధ్యంలో గంగాదేవి తారస పడింది. విషయం తెలుసుకొని గంగ ఆ బీజశక్తిని తీసుకొని తల్లినౌదామని తలంచి ఆ బీజశక్తిని గ్రహించింది. గంగా దేవి కూడ శివుని బీజశక్తిని భరింపలేక తన ప్రవాహంతో ఉదయపర్వతం దగ్గర వున్న 'రెల్లుగడ్డి(సార)వున్న ప్రదేశంలో వదిలింది. పదివేల సంవత్సరాలు గడవగా రెల్లుగడ్డిలో శివుని బీజశక్తి బాలుని రూపంగా రూపుదాల్చింది. ఆరుగురు కృత్తికలు ఆ బాలుని చూసి జాలిపడి వారికి తమ స్తన్యములతో పాలు తాగించగా ఆరుముఖములతో పాలు తాగినందున 'షణ్ముఖుడు'గా పేరు గాంచాడు. విషయం తెలుసుకొని అగ్ని, గంగ, శివుడు, పార్వతి నలుగురూ ఆ బాలుని తమ కుమారుడని వాదించారు. చివరకు అగ్నికి నైగమేయుని'గా, గంగకు 'సఖ'గా, శివునకు 'కుమార'గా, పార్వతికి 'వినాఖ'గా నాలుగు ముఖాలుగా కనిపించాడు.

**ద్రోణుడు**

అంగిరసుని కుమారుడు బృహస్పతి. బృహస్పతి కుమారుడు భరద్వాజుడు. భరద్వాజుడు గంగా తీరంలో తపస్సు చేసుకుంటున్నాడు. ఆ సమయంలో 'ఘృతాచి' అనే అప్సరస గంగానదిలో స్నానం చేస్తుండగా చూచి ఆమె అందానికి చలించి పోగా భరద్వాజుని బీజశక్తి బయల్వెడలినది. భరద్వాజుడు ఆ బీజశక్తిని ఒక కుండలో వుంచి భద్రపరచాడు. కొంతకాలానికి ఆ బీజశక్తి మగశిశువుగా రూపుదాల్చింది. ద్రోణము(కుండ) నుండి జన్మించినందున భరద్వాజుడు ఆ పిల్లవానికి 'ద్రోణుడు' అని పేరు పెట్టి తన గురుకులంలో విలువిద్యను నేర్పి, తరువాత పరశు రాముని దగ్గరకు విద్యాభ్యాసానికి పంపించాడు.

**ఊర్వశి**

బదరికావనంలో నరనారాయణులు తపస్సు చేస్తున్న సమయంలో ఇంద్రుడు తన పదవి పోతుందనే భయంతో మొదట క్రూరమృగాలను వారి తపస్సు భగ్నం చేయడానికి ఉసిగొల్పాడు. విఫలం కావడంతో గాలివానతో కుంభ వృష్టి కురిపించాడు. అయినా వారు చలించలేదు. రతీమన్మథులను కూడ ప్రయోగించాడు. అయినా వారు

చలించలేదు. చివరకు మేనక, రంభ, తిలోత్తమ, సుకేశిని, మనోరమ, మహేశ్వరి, పుష్పగంధ, ప్రమద్వర, ఘృతాచి, చంద్రప్రభ, సోమ, విద్యున్మాల, అంబుజాక్షి, కలకమాల మొదలైన అప్సరసలను, పదివేల ఎనభైమంది దాసీ జనాన్ని పంపించాడు. నారాయణుడు తపస్సునుండి మేల్కొని కళ్ళు తెరచి ఒక విధమైన అసహనంతో తన కుడి తొడను చరిచాడు. అలా చరచగా ఆ తొడనుండి అద్భుతమైన అందగత్తె ఉద్భవించింది. నారాయణుని ఊరువునుండి ఉద్భవించి నందున ఆమెకు 'ఊర్వశి' అనే పేరు వచ్చింది.

### కృపాచార్యుడు – కృపి

గౌతమమహాముని కుమారుడు శరధన్వుడు. పుట్టుకతోనే చేతిలో శరములతో (బాణాలతో) పుట్టాడు. శరధన్వుడు బ్రహ్మను గూర్చి తపస్సు చేస్తుండగా ఇంద్రుడు భయపడి 'జనాపది' అను అప్సరసను అతడి తపస్సు భగ్నం చేయడానికి పంపించాడు, శరధన్వుడు ఆ అప్సరస అందానికి కొంత చలించి ఆయుధాలు వదలి మళ్ళీ తపస్సుకు బయలుదేరాడు. కానీ అప్సరస అందానికి చలించిన ఫలితంగా నియంత్రణ కోల్పోవడంవల్ల బీజశక్తి బయల్వెడలి గడ్డిపై రెండు భాగాలుగా విడకొట్టినట్లు పడింది. ఆ బీజశక్తిలోని ఒక భాగం నుండి మగ శిశువు మరొకభాగం నుండి ఆడశిశువు జన్మించారు. వేటకై అరణ్యానికి వచ్చిన శంతన మహారాజు ఆ పసిపిల్లలను చూసి జాలిపడి హస్తినాపురానికి తీసుకొని వెళ్ళి మగశిశువుకు 'కృపుడు' అని, ఆడశిశువుకు 'కృపి' అని పేర్లు పెట్టి పెంచాడు.

**గమనించవలసిన విషయములు :**

1. మాంధాతకు అంబరీషుడు, ముచికుందుడు, పురుకుత్సుడు అను ముగ్గురు కుమారులు, 50 మంది కుమార్తెలు ఉన్నారు.

2. కొన్ని కథలలో యవనాశ్వుడు చ్యవనుని ఆశ్రమం వెళ్ళినట్లు, చ్యవనుడే మంత్రజలం తయారుచేసి ఆశ్రమంలో ఉంచగా యవనాశ్వుడు పొరపాటున ఆ జలం తాగినట్లు చెప్పబడింది. అశ్వనీదేవతలు వచ్చి శస్త్రచికిత్సచేసి యువనాశ్వుని గర్భం నుండి మాంధాతను వెలికితీసినట్లు చెప్ప బడింది.

3. రెల్లు (సంస్కృతంలో శార) పొదలలో పుట్టినందున 'శరవణ భవుడు'గా, కృత్తికల పాలుతాగినందున 'కార్తికేయుడుగా, ఆరు

ముఖములతో పాలు తాగినందున 'షణ్ముఖుని'గా, పార్వతి తనయుడై నందున 'స్కందుడు'గా, నలుగురు తమ కుమారునిగా కోరారు కాబట్టి 'కుమారస్వామి'గా పిలువబడ్డాడు. దక్షిణ భారతదేశంలో అయ్యన్, చెయ్యన్, కంద, మహాసేన, స్వామినాథ, విశాఖ, అరుముగం, వేలాయుధ,దండపాణి, గురుగుహ, మురుగ, పళనిస్వామి, సుబ్రహ్మణ్యుడు అనే పేర్లతో పిలువ బడ్డాడు.

4. కుమారస్వామి మంచి బ్రహ్మత్వంతో వున్నందున 'సుబ్రహ్మణ్యుడు'గా తెలుగు వారికి ఆరాధ్యుడైనాడు. తన తమ్ముడైన వినాయకునకు గణాధిపత్యం ఇచ్చాడని తండ్రియైన శివుని పై అలిగి శ్రీశైలం వచ్చి అక్కడ అడవులలో వున్న చెంచులు పెంచుకున్న నాగకన్య (ఆదిశేషుని మనుమరాలు) 'వల్లి'ని మోహించాడు. చెంచులు తన కుమార్తె పగలు మామూలు స్త్రీగా రాత్రి నాగుపాముగా మారుతుందని అందువల్ల తమ కుమార్తెను సుబ్రహ్మణ్యునికి ఇచ్చి వివాహం చేయలేమని అన్నారు. అందుకు సుబ్రహ్మణ్యుడు తానుకూడ నాగుపాముగా మారి వల్లిని వివాహం చేసుకుంటానని వారిని ఒప్పించి వల్లిని వివాహం చేసుకున్నాడు. అందువల్ల సుబ్రహ్మణ్యస్వామీనీ 'నాగ దేవత' రూపంలో కూడా భక్తులు కొలుస్తున్నారు.

5. భరద్వాజుని గురుకులంలో ద్రోణాచార్యునికి పాంచాలదేశ రాకుమారుడు ద్రుపదుడు సహాధ్యాయి. ద్రోణుడు కృపా చార్యుని చెల్లెలు కృపిని వివాహం చేసుకున్నాడు.

6. ఊర్వశి అప్సరసలందరికంటె సౌందర్యము కలది. గాయని కూడా. గాయనిగా అప్సరసలలో 11వ స్థానంలో వుంది.

**సుపథ సౌజన్యంతో**

## ధ్యానం

ధ్యానం స్థిరమైన తర్వాత దానిని వదలుదామన్నా వీలుకాదు. నీవు ఆటలలో ఉన్నా, ఉత్సవాలలో ఉన్నా, పనిచేసుకుంటున్నా, ధ్యానం నీ ప్రయత్నం లేకనే సాగిపోతుంది. పైగా అది నిద్రలోను ఆగదు అప్పుడే ధ్యానం నీ సహజ స్వభావం అయ్యేంతలోతుగా "చెట్టువేరువలె పాతుకుపోయిందని" అర్థం.

**– రమణ మహర్షి**

# వార్తలు - విశేషాలు

**ధవళేశ్వరం :**

ది. 11.5.2020వ తేదీన ప్రపంచ ప్రఖ్యాత తత్వవేత్త శ్రీ జిడ్డు కృష్ణమూర్తిగారి 125వ జయంతి సందర్భంగా తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో గోదావరి దివ్యజ్ఞాన సమాజంవారు ప్రత్యేక సమావేశము Zoom ద్వారా ఆన్‌లైన్‌లో ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో డా॥రామకృష్ణగారు (వైజాగ్) ప్రసంగించారు.

**గుంటూరు :**



శ్రీకృష్ణదివ్యజ్ఞాన సమాజం, గుంటూరు వారు అంతర్జాలము ద్వారా దివ్యజ్ఞాన అధ్యయన కార్యక్రమాన్ని ఆగష్టు 16, 2020వ తేదీన ప్రారంభించారు. ఈ అధ్యయన నిర్వాహకులు, వక్త శ్రీ జి.వీరరాఘవరావుగారు. వీరు "ద డివైన్ ప్లాన్" అను గ్రంథాన్ని తెలుగులో వివరించుచున్నారు. ఈ కార్యక్రమము ప్రతి ఆదివారం ఉ॥ 11.30 ని॥లకు ప్రారంభించి ఒక గంట పాటు కొనసాగిస్తున్నారు. సుమారు 30 మంది దివ్యజ్ఞాన సమాజముల సభ్యులు పాల్గొని ఆధ్యాత్మికానందానుభుతిని చెందుతున్నారని సమాజ కార్యదర్శి దీపికకు తెలియజేసారు.

**విజయనగరం :**

వశిష్టా దివ్యజ్ఞాన సమాజము, విజయనగరం సమాజసభ్యులైన శ్రీ రామసింగు బుచ్చెన్నగారు (డి.నెం.82472) 20 జూలై 2020న మరియు శ్రీమతి ఎలిశెట్టి ప్రభావతిగారు 31, జూలై 2020వ తేదీన స్వర్గస్తులైనారు. వారికి ఉత్తమగతులు ప్రాప్తించాలని ప్రార్థిస్తూ సమాజ సభ్యులు రెండు నిమిషములు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారని సమాజ కార్యదర్శి సో॥ కృష్ణారావుగారు దీపికకు తెలియజేసారు.